క్లుప్తంగా

ప్రిన్సిపాల్‌గా బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపాల్ నాగేంద్రను అభినందిస్తున్న అధ్యాపకులు

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (పూర్తి అదనపు బాధ్యతలు) ప్రిన్సిపాల్‌గా అర్థశాస్త్ర అధ్యాపకులు మాడుగుల నాగేంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రాబిల్లి భూషణరావు ఉద్యోగ విరమణ పొందారు. నూతన ప్రిన్సిపాల్ నాగేంద్రకు అధ్యాపకులు అభినందనలు తెలిపారు. కళాశాల నిర్వహణలో తమవంతు సహకారం అందిస్తామన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం



వాబ యోగేశ్వరరావు

సారవకోట: ఎస్సీ, ఎస్టీ కులాల వర్గీకరణ చేపట్టాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమైనదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి వెనుకబడిన ఆదివాసీలు మరింత అభివృద్ధి చెందేందుకు వర్గీకరణ దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ వర్గీకరణను తాము పూర్తిస్థాయిలో స్వాగతిస్తున్నామన్నారు.

108 సేవలపై ఆరా



సిబ్బందికి సూచనలిస్తున్న హరిప్రసాదరావు

నరసన్నపేట: ప్రమాదాలు, పాము కాటు వంటి అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనాలను సక్రమంగా వినియోగించుకోవాలని 108 జిల్లా మేనేజర్ బొమ్మాళి హరిప్రసాదరావు అన్నారు. గురువారం ఆయన నరసన్నపేట 108 వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అత్యవసర సమయాల్లో వినియోగించే పరికరాల పనితీరును, మందులను, రికార్డులను పరిశీలించారు. మెడికల్ టెక్నీషియన్ కె.అనంద్, పైలెట్ రామారావుకు సూచనలు చేశారు.

ఆర్అండ్‌బీ స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

పాతపట్నం: స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఉన్న ఆవరణాన్ని తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. గతంలో కోర్టు నూతన భవన నిర్మాణం కోసం ఈ స్థలాన్ని పరిశీలన చేశారు. తక్కువ స్థలం కావడంతో పక్కనే ఆనుకుని ఉన్న ఆర్అండ్‌బీ స్థలాన్ని పరిశీలించామన్నారు. డీటీ బి.ప్రసాదరావు, మండల సర్వేయర్ రామగణపతి ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపారాణి

హిరమండలం: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎంపీడీఓ స్వరూపారాణి సూచించారు. గురువారం మర్రిగూడ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను, వసతిగృహాన్ని సందర్శించారు. పిల్లలను పలు విషయాలపై ప్రశ్నించారు. విద్యార్థుల నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని.. విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందించాలని ఆదేశించారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఎస్ఐ నాగరాజు

బూర్జ: విద్యార్థులు వివిధ రకాల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బూర్జ ఇన్‌చార్జి ఎస్ఐ, ఆమదాలవలస ఎస్ఐ-2 నాగరాజు అన్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం చట్టాలపై అగాహన కలిగించారు. మైనర్ బాలురు-బైక్ రైడింగ్ నిషేధం, చట్టాలు, శిక్షలు, ప్రమాదాలపైన, బాలికల సంరక్షణ, ఈవ్‌టీజింగ్ వంటి చట్టాలను వివరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ పీఓ ఠాగూర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంతెనల సంగతేంటి సారూ..?

- ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా ప్రచారం చేసిన టీడీపీ
- గెలిచిన తరువాత ఆ దిశగా ఎక్కడా కనిపించని చర్యలు
- శిథిలావస్థలో మరిన్ని వంతెనలు
- తీరప్రాంతంలో మత్స్యకారులు, ఆక్వా రైతుల అవస్థలు



అంపలాం వద్ద ఉప్పుగెడ్డపై శిథిలావస్థకు చేరుకున్న దశాబ్దాల నాటి వంతెన

పోలాకి: అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో అవసరమైన ప్రతిచోటా కొత్త వంతెనలు, శిథిలావస్థమైన చోట మళ్లీ అక్కడే వంతెనలను పునర్నిర్మాణం చేపడతామని ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా ప్రచారం చేసిన టీడీపీ అధికారంలోకి వచ్చింది. ముఖ్యంగా వనితమండలం నుంచి శాలిహుండం గ్రామాన్ని కలుపుతూ వంశధార నదిపై ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంతెన పనులు వేగవంతం చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో మిగిలిన వంతెనల సంగతేంటి సారూ..? అంటూ సర్వత్రాచర్చ జరుగుతోంది. నరసన్నపేట నియోజకవర్గంలో ప్రధాన ఆయకట్టు కలిగిన వంశధార ప్రాజెక్టుకు సంబంధించి అనేక చానళ్లున్నాయి. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల్లో ప్రధాన రహదారులపైన, కొన్ని తీర ప్రాంత గ్రామాల్లో, మరికొన్ని వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. వీటన్నింటిపై క్షేత్రస్థాయిలో ఆయా శాఖలతో సమీక్ష నిర్వహించి వీలైనంత తొందరలో నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- నరసన్నపేట మండలంలో కిల్లాం దగ్గర ఓపెన్ హెడ్ చానల్‌పై ప్రధాన రహదారిపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది.
- ఉర్లాం-బడ్డవానిపేట వద్ద నూకాలమ్మ చానల్‌పై వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది.
- గొనపపేట ఆర్అండ్‌బీ రహదారి నిర్మాణం జరిగినా.. పోలాకి ఓపెన్ హెడ్ చానల్‌పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదు.
- పోలాకి మండలంలో అంపలాం వద్ద ఉప్పుగెడ్డపై దశాబ్దాల నాటి వంతెన శిథిలావస్థకు చేరుకుంది.



డీఎల్‌పురం వద్ద పాచాకుల గెడ్డపై శిథిలావస్థకు చేరిన కల్వర్టు

- బెలమర-డీఎల్‌పురం రెవెన్యూ పరిధిలో పాచాకుల గెడ్డపై 2015లో కాలువల విస్తరణలో పాడైన పైపు కల్వర్టు నేడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది.
- డీఎల్‌పురం పంచాయితీ పరిధిలో సత్రవుపేట-ఉర్జాం మధ్యలో ఉప్పుగెడ్డపై వంతెన అవసరాన్ని గుర్తించిన అధికారులు ఆ తరువాత అక్కడే మర్చిపోయినట్లున్నారు.
- డీపీఎన్ రహదారిపై సుసరాం-ప్రియాగ్రహారం వద్ద తంపర కాలువపై వంతెనకు కాలం చెల్లినా పట్టించుకోవటం లేదు.
- సారవకోట మండలంలో బైదిలాపురం వద్ద వంశధార కాలువపై వంతెన నిర్మాణం కోసం అక్కడి ప్రజలు ఎదురుచూస్తున్నారు.
- జలుమూరు మండలంలో కిట్టాలపాడు-కరకవలస మధ్యలో వంశధార కాలువలపై వంతెన అవసరాన్ని గుర్తించి అలాగే వదిలేశారు.
- చోడవరం-అంధవరం మధ్యలో వంశధార ఓపెన్ హెడ్ కాలువపై శిథిలావస్థకు చేరిన వంతెన ఎప్పుడు కూలిపోతుందో అన్నట్లు ఉంది.
- ఉప్పరపేట వద్ద కూలిపోయిన వంతెన మళ్లీ పునర్ నిర్మించాలన్న అధికారుల ఆలోచన అక్కడ వరకే పరిమితమైంది.

వంతెన అవసరాన్ని అధికారులు గుర్తించాలి



పాచాకుల గెడ్డపై వంతెన అవసరాన్ని అధికారులు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి. తీర ప్రాంతంలో చాలా వరకు ఇలాంటి వంతెనల అవసరం వుంది. 2015లో తంపర కాలువల విస్తరణ తరువాత ఇక్కడి కల్వర్టు పూర్తిగా శిథిలమైంది. దీనిపై నాయకులు కూడా స్పందించి చర్యలు తీసుకోవాలి.

– చింతు తవిటయ్య, ఆక్వారైతు, బెలమర, పోలాకి మండలం

ఆరోగ్యశ్రీని నీరుగార్చే ప్రయత్నం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: మాజీ ముఖ్యమంత్రి, దివంగిత మహనేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2007లో అమల్లోకి తీసుకువచ్చిన ఆరోగ్యశ్రీ పథకానికి టీడీపీ కూటమి ప్రభుత్వం నిలిపివేసి, కార్పొరేట్ ఆస్పత్రులకు కొమ్ముకాసేలా చర్యలు తీసుకుంటుందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పేద కుటుంబంలో దురదృష్టవశాత్తు ఎవరికైనా జబ్బు చేసిన, ప్రమాదం జరిగిన ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్య సేవలు అందించాలన్నారు. వైఎస్సార్‌సీ అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ సేవల్లో 1,059 రోగాల నుంచి 3,257 రకాల రోగాలను పెంచారన్నారు. రూ.5 లక్షల వరకు మాత్రమే ఉన్న ఆరోగ్యశ్రీ పరిధిని మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఏకంగా రూ.25 లక్షల వరకు పెంచారు. కేవలం ఒక్క ఆరోగ్యశ్రీని కాకుండా ప్రభుత్వ వైద్య, ఆరోగ్య రంగంలో గత ఐదేళ్లలో చేపట్టిన సంస్కరణలను చంద్రబాబు ప్రభుత్వం నీరుగార్చేలా అడుగులు వేస్తుందని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు బిల్లులు రాకపోవడంతో రోగులకు చికిత్సలు అందని పరిస్థితి నెలకొందని, కేంద్ర ప్రభుత్వ పథకంతో పేదలు సరిపెట్టుకోవాలని స్వయంగా కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందేనన్నారు. దేశంలో ఎక్కడా కనివినిఎరుగని విధంగా హెల్త్ డిపార్ట్ డాక్టర్లతోపాటు సిబ్బంది సుమారు 55 వేల మందిని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నియమించినట్లు గుర్తు చేశారు. దేశంలోనే తొలిసారిగా కోవిడ్ చికిత్సను ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చి విపత్తు వేళ భరోసా కల్పించిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పాతపట్నం నియోజకవర్గంలో నాడు-నేడు పనుల్లో భాగంగా 9 పీహెచ్‌సీ భవనాల్లో మరమతులు, ఆధునికీకరణ నిమిత్తం సుమారు.5 కోట్లతో పనులు పూర్తయ్యయన్నారు. సీహెచ్‌సీల ఆధునీకరణ నిమిత్తం పాతపట్నం, కొత్తూరు సీహెచ్‌సీలకు సుమారు రూ.8.50 కోట్లు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులు 508 మందికి ప్రభుత్వం ఉచితంగా అందించిన పాఠ్య, నోట్ బుక్స్, బ్యాగులను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గురువారం పంపిణీ చేశారు. చదువుపైనే మనసు పెట్టి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపల్ ఎస్.సత్యనారాయణ, ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు, అధ్యాపకులు ఆనందరావు, మల్లేష్, లక్ష్మీనారాయణ, శాంతారావు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలి..

నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందివ్వాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో నూతన కాంట్రాక్టర్ సమకూర్చిన భోజన సరఫరాను ఎమ్మెల్యే ప్రారంభించారు. భోజనాల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ జయశ్రీకి సూచించారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ ఊడి సంతోష్, నరసన్నపేట ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్



హిరమండలం: నోటిఫికేషన్‌ను అతికిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల ఎన్నికలకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలల్లో నోటిఫికేషన్ జారీచేశారు. పాఠశాలల హెచ్ఎంలు నోటిఫికేషన్‌ను నోటీస్ బోర్డులపై అతికించారు. ఈ నెల 8న ఎన్నికలు జరగనున్నాయి. ఈ కమిటీలకు సంబంధించి జూలై 31తో గడువు ముగియడంతో కొత్త కమిటీ ఎన్నిక అనివార్యంగా మారింది. ఈ ఎన్నికలు సజావుగా జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు.

ఎన్నికలు బాధ్యతగా నిర్వహించాలి

నరసన్నపేట: స్కూల్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ గురువారం విడుదలైందని, ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. స్కూల్ కమిటీ ఎన్నికల విధివిధానాలు వివరించారు. ఎన్నిక అనంతరం నిర్వహించాల్సిన సమావేశం గురించి తెలిపారు. కమిటీ సభ్యులు ఎన్నికల్లో రిజర్వేషన్లు పాటించాలన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ స్కూల్ విద్యార్థులు

నరసన్నపేట: డబ్బాపాలు వద్దు.. తల్లిపాలే ముద్దు అని స్థానిక వర్షిణి నర్సింగ్ స్కూల్ విద్యార్థినులు గురువారం ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మొదటిరోజు స్థానిక నేతాజీ వీధికి చెందిన నర్సింగ్ స్కూల్ విద్యార్థినులు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమన్నారు. నేతాజీ వీధి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు.

పాతపట్నంలో..

పాతపట్నం: తల్లి పాలతో బిడ్డకు నాణ్యమైన ప్రోటీన్లు అంది మెదడు వికసిస్తుందని, శిశువుకు సమతుల్యమైన ఆహారం అందుతుందని ఐసీడీఎస్ పీఓ విమలరాణి అన్నారు. మండలంలోని తామర అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ మామిడి సుదీక్ష ఆధ్వర్యంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీఓ మాట్లాడుతూ శిశువు పుట్టిన తర్వాత గంటలోగా తల్లులకు వచ్చే పాలు కచ్చితంగా పట్టాలన్నారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బూర్జలో..

బూర్జ: తల్లిపాలు పిల్లలకు అమృతం వంటివని బూర్జ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పి.రత్నం అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం బూర్జ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గూర్చి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



పాతపట్నం: ర్యాలీలో పాల్గొన్న పీఓ, సర్పంచ్, తదితరులు



బూర్జ: తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మాజీ సైనికునికి ఘన స్వాగతం



ఆర్మీ ఉద్యోగి రవిశేఖర్‌ను ఊరేగిస్తున్న గ్రామస్తులు

పొందూరు: దేశ రక్షణలో 22 ఏళ్లుగా సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన ఆర్మీ ఉద్యోగి ఇప్పిలి రవిశేఖర్‌కు మండలంలోని బురిడకంచరాం గ్రామ ప్రజలు గురువారం ఘనంగా స్వాగతం పలికారు. ఓపెన్ టాప్ జీప్‌పై తండ్రి ఇప్పిలి సూరయ్యతో కలిసి ఆయనను ఊరేగిస్తూ పూలవర్షం కురిపించారు. ఊరేగింపులో గ్రామపెద్దలు, విద్యార్థులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక రేపు

సరుబుజ్జిలి: ఈ నెల 3వ తేదీ ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉపాధి హామీ ఏపీఓ బొత్స పార్వతి గురువారం తెలిపారు. డ్వామా పీడీ, ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది పాల్గొంటారని వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తూరు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించటం వంటి పనులు చేస్తామన్నారు. కొత్తూరు, మహసింగి, కర్లెమ్మ, పారాపురం, మదనాపురం, సోమరాజపురం, ఆర్.కె.పురం తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

హిరమండలం మండలంలో..

హిరమండలం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గులుమూరు ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు టెక్కలి డివిజన్ ఈఈ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్టు కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గులుమూరు, శాస్త్రులపేట, కొండరాగోలు, దుర్బలాపురం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దు..

పొందూరు: స్థానిక లావేటివీధికి సమీపంలో గల అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డులో సెల్ టవర్‌ను ఏర్పాటు చేయవద్దని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈఓ రమేష్‌కు గురువరాం వినతిపత్రం అందజేశారు. నివాస స్థలాలకు సమీపంలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తే రేడియషన్ ప్రభావం ఉంటుందన్నారు.

మనుషుల్లో పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పశువులపైన ప్రభావం ఉంటుందన్నారు.

పట్టపగలే వెలుగులు



జగనన్న లేవుట్‌లో పగలే వెలుగుతున్న వీధి దీపం

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలోని నాలుగు జగనన్న లేవుట్లలో వీధి దీపాలు గత రెండు నెలలుగా నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. రాత్రీ, పగలు తేడా లేకుండా ఇవి వెలుగుతుండటంతో విద్యుత్ వృథా అవుతోంది. ఇళ్లకు మీటర్లు ఇవ్వడం లేదని, వీధి దీపాలు 24 గంటలూ వెలుగుతునే ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యపై సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు స్పందించి పగటిపూట వెలగకుండా నియంత్రణ చర్యలు చెపట్టాలని కోరుకుంటున్నారు. పాతపట్నం, కొదూరు పంచాయతీలకు జగనన్న కాలనీలను అప్పగించకపోవడంతో ఆయా పంచాయతీల సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ రమేష్ స్పందిస్తూ.. స్విచ్ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత పంచాయతీదేనని తెలిపారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

బూర్జ: స్థానిక తహసీల్దార్‌గా జె.ఈశ్వరమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె సార్వత్రిక ఎన్నికలలో భాగంగా అనకాపల్లి జిల్లాలో విధులు నిర్వహించి ప్రస్తుతం బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సార్వత్రిక ఎన్నికలలో భాగంగా విధులు నిర్వహించిన ఎస్.వి.అంబేద్కర్‌కు అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కి డీటీ సంతోష్‌కుమార్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు.

జలుమూరు: స్థానిక తహసీల్దార్‌గా డి.లక్ష్మీనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు శ్రీకాకుళం జిల్లా నుంచి బదిలీపై విజయనగరం తహసీల్దార్‌గా వెళ్లారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సరుబుజ్జిలి: స్థానిక తహసీల్దార్‌గా ఎల్.మధుసూదన్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పలాస తహసీల్దార్‌గా పనిచేసి ఎన్నికల బదిలీల్లో భాగంగా అనకాపల్లి జిల్లా వెళ్లారు. కార్యాలయం సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

సారవకోట: స్థానిక తహసీల్దార్‌గా కె.విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె ఇక్కడ నియమితులయ్యారు. ఆమెను స్థానిక సిబ్బంది అభినందించారు.

పొందూరు: స్థానిక తహసీల్దార్‌గా ఎస్.రమేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. డీటీ శ్రీనివాసరావు, ఆర్ఐ రాధ, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట గ్రామంలోని వంశధార నదీ తీరంలో ఉన్న బంగారమ్మ గుడి వరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామంలో ఉన్న కేజీబీవీ నుంచి బంగారమ్మ గుడి వరకు తన కుటుంబ సభ్యులతోపాటు పలువురు పెద్దల సహకారంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టామని ఆదే గ్రామానికి చెందిన బంగారు సంతోషి సంస్థల సభ్యులు వైశ్యరాజు చంద్రశేఖరరాజు (పొట్టిరాజు), వైశ్యరాజు పాండురంగనాథరాజు, శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. కేజీబీవీ నుంచి గుడి వరకు రోడ్డు నిర్మాణానికి నీలకంఠ పాణిగ్రహితోపాటు మరికొందరు దాతలు స్థలం ఇచ్చారన్నారు. రోడ్డు నిర్మాణానికి కొంత స్థలం అవసరం ఉందని, వారు కూడా సానుకూలంగా స్పందించి భక్తుల సౌకర్యార్థం స్థలాన్ని విరాళంగా ఇవ్వాలని కోరారు.

గోతులమయం



అధ్వానంగా ఉన్న గొట్టిపల్లి-కొమ్మువలస రోడ్డు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రోడ్లు గోతులమయంగా దర్శనమిస్తున్నాయి. మరమ్మతులు చేపట్టకపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి. అలికాం-బత్తిలి రోడ్డు నుంచి ముంగెన్నపాడు, కొమ్మువలస, గొట్టిపల్లి, సరడాం, చొర్లంగి, జాడుపేట గ్రామాలతోపాటు లక్ష్మీనర్సుపేట రోడ్డు నుంచి బసవరాజుపేట గ్రామానికి వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అత్యవసర సమయాల్లో ఆటోలపై వెళ్లలేని దుస్థితి. రోడ్లును బాగుచేయాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

బురదమయం



విజయలక్ష్మీనగర్‌లో బురదమయంగా ఉన్న రహదారి

నరసన్నపేట: మేజరు పంచాయతీ శివారు వీధుల్లో రహదారులు బురదమయంగా ఉన్నాయి. దీంతో సమీప గృహాలకు చెందినవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విజయలక్ష్మీనగర్‌లో రహదారి మరింత అధ్వానంగా తయారైంది. సమీప ఖాళీ స్థలాల్లో ఉన్న మురుగునీరు రోడ్డుపైకి రావడంతో వాహనలతోపాటు నడిచేందుకు కూడా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరామర్శ..



రాములు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణచైతన్య, నాయకులు

సారవకోట: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి రాములు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య గురువారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, కొండాల బాబూరావు, సారవకోట పీఏసీఎస్ మాజీ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, పార్టీ నాయకులు పల్లి కృష్ణారావు, కోరాడ అప్పయ్య, గొర్లె ఢిల్లీరావు ఉన్నారు.

